


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02 4PM

బంగారం ధర 10 GRMS 24 CARAT ₹62,830
వెండి ధర 1KG 75,400
సెన్సెక్స్ 605 72,490
నిఫ్టీ 197 22,002
చికెన్ ధర 1KG ₹ 280
గుడ్ల ధరలు డజన్ ₹68


# వైఎస్సార్‌సీపీకి బిగ్ షాక్.. మరో ఎంపీ రాజీనామా

## పార్టీకి రాజీనామా చేసిన ఎంపీ మాగుంట



వైఎస్సార్‌సీపీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. ప్రకాశం జిల్లా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పార్టీకి గుడ్ బై చెప్పారు. ఇవాళ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.. భవిష్యత్ కార్యాచరణపై అనుచరులతో చర్చించి త్వరలోనే నిర్ణయం ప్రకటిస్తాను అంటున్నారు. ఇటీవల పరిణామాలు తనను ఎంతగానో బాధించాయని.. అనివార్య పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీని వీడాల్సి వస్తోందన్నారు. తన కుమారుడు రాఘవరెడ్డిని ఎన్నికల్లో పోటీలో ఉంచాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. ఎంతో బాధతో పార్టీకి రాజీనామా చేస్తున్నానని.. అన్ని విషయాలను త్వరలోనే వెల్లడిస్తానన్నారు. 33 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని.. 11 సార్లు చట్టసభలకు పోటీ చేశానన్నారు. ప్రకాశం జిల్లాలో మాగుంట అంటే.. ఒక బ్రాండ్ ఉందన్నారు. తమ కుటుంబానికి అహం లేదని.. ఉన్నది ఆత్మాభిమానం మాత్రమే అన్నారు. జగన్‌ను తమ కుటుంబసభ్యుడిగా భావించామని.. ఐదేళ్లు సహాయ సహకారాలు అందించిన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. వచ్చే ఎన్నికల బరిలో ఉండే మాగుంట కుటుంబాన్ని ప్రకాశం జిల్లా ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం ఒంగోలులో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని దూరంపెట్టింది. ఒంగోలు పార్లమెంట్ వైసీపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని సీఎం జగన్ తెరపైకి తెచ్చారు. ఈ పరిణామాలపై మాగుంట శ్రీనివాసులు రెడ్డి అసంతృప్తిగా ఉన్నారు. ఈ క్రమంలో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు మార్చి మొదటి వారంలో మాగుంట టీడీపీలో చేరనున్నట్లు తెలుస్తోంది.మాగుంట రాజీనామాతో కొద్ది రోజుల్లోనే ఆరుగురు ఎంపీలు వైఎస్సార్‌సీపీ వీడారు.



### తెలంగాణలో
## ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తెలంగాణలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఇవాళ్టి నుంచి మార్చి 19 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులు కలిపి మొత్తం 9,80,978 మంది పరీక్షలు రాస్తున్నారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 4,78,718 మంది, సెకండ్ ఇయర్ విద్యార్థులు 5,02,260 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్షల కోసం అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 1,521 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు నిమిషం ఆలస్యంగా వచ్చినా అధికారులు అనుమతించడంలేదు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా టీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.



### రాజీవ్ గాంధీ హంతకుడు
## గుండెపోటుతో మృతి

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో నిందితుడు సుతేంద్రరాజా అలియస్ శంతన్ చెన్నైలో మృతిచెందారు. రాజీవ్ హత్య కేసులో జైలు నుంచి రిలీజైన ఏడు మంది ముద్దాయిల్లో అతను ఒకడు. శ్రీలంక జాతీయుడైన శంతన్.. కొన్ని రోజుల క్రితం చెన్నైలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.ఇవాళ తెల్లవారుజామున 7.50 నిమిషాలకు అతనికి గుండెపోటు వచ్చినట్లు ఆస్పత్రి డీన్ డాక్టర్ వీ తేరనిరాజన్ తెలిపారు.కాలేయం దెబ్బతినడంతో చికిత్స కోసం అతను ఆస్పత్రిలో చేరినట్లు డాక్టర్లు చెప్పారు. వాస్తవానికి ఇవాళ తెల్లవారుజామున 4 గంటలకు గుండెపోటు వచ్చినప్పుడు అతనికి సీపీఆర్ చేసినట్లు వెల్లడించారు. కానీ మళ్లీ 7.50కి పోటు రావడంతో అతను చనిపోయినట్లు చెప్పాడు. రాజీవ్ గాంధీ హత్య కేసులో సంతన్‌కు మరణశిక్ష పడింది. 1999లో సుప్రీంకోర్టు ఆ తీర్పును సమర్థించింది కూడా. సంతన్‌తో పాటు మురుగన్, పెరారివాలన్ కు కూడా మరణశిక్ష విధించారు. అయితే ఆ ముగ్గరికీ క్షమాభిక్ష పెట్టారు. దాంట్లో శంతన్ నవంబర్ 2022లో రిలీజయ్యాడు. 1991లో జరిగిన రాజీవ్ హత్య కేసులో.. తమిళ టైగర్స్‌కు శంతన్ ఓ ఇంటెలిజెన్స్ సభ్యుడిగా చేసినట్లు తెలుస్తోంది.

## పేట్ బషీరాబాద్‌లో అగ్ని ప్రమాదం

పేట్ బషీరాబాద్‌లోని రాఘవేంద్ర కాలనీలో అగ్నిప్రమాదం సంభవించింది. కాలనీలోని ఓ పండ్ల దుకాణం, మటన్ షాపు, స్క్రాప్ దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దాంతో స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు.స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ మంటల్లో మొత్తం నాలుగు దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆ టైమ్ వచ్చింది

తన రాజకీయ అరంగేట్రానికి ఇదే సరైన సమయం అన్నారు బాలీవుడ్ నటి కంగనా రనౌత్. ఆమె రాజకీయాల్లోకి వస్తున్నట్లు కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంలో ఆమె మాట్లాడుతూ 'సినిమాల్లో ఉంటూనే రాజకీయ పార్టీలతో తలపడ్డాను. నటిగా కన్నా దేశహితం కోరుకునే జాతీయవాదిగానే నాకు గుర్తింపు ఎక్కువ. దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు నాపై చాలా ప్రేమ చూపించారు. దేశం నాకు చాలా ఇచ్చింది. తిరిగి ఇవ్వడం నా బాధ్యత. ఒకవేళ నేను రాజకీయాల్లోకి అడుగుపెట్టాలనుకుంటే అందుకు ఇదే సరైన సమయం' అన్నారు. ఆమె త్వరలోనే బీజేపీలో చేరబోతున్నారని బాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది. ప్రస్తుతం ఆమె నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. ఇందులో కంగనా రనౌత్ దివంగత ప్రధాని ఇందిరాగాంధీ పాత్రను పోషించారు. ఎమర్జెన్సీ నాటి పరిస్థితులను ఈ చిత్రంలో ఆవిష్కరించనున్నారు. అలాగే 'తను వెడ్స్ మను', 'క్వీన్ 2' చిత్రాల్లో కంగన నటిస్తున్నారు.





### ఓట్ల కోసం మంగళ సూత్రాలు అమ్ముకున్న నువ్వా మాట్లాడేది..
# మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తెలంగాణలో రాజకీయం మరింత రసవత్తరంగా మారుతోంది. ముఖ్యంగా.. కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య మాటలు తూటాల్లా పేలుతున్నాయి. ఎంపీ బండి సంజయ్ చేపట్టిన ప్రజాహిత పాదయాత్ర హుస్నాబాద్‌లో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీస్తోంది. పాదయాత్రలో భాగంగా బండి సంజయ్ చేసిన కామెంట్స్ తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. ఆయన చేసిన కామెంట్స్‌పై తాజాగా మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. ఎన్నికల్లో ఓట్ల కోసం భార్య మంగళ సూత్రాలను అమ్ముకున్న వ్యక్తివి నువ్వు మాట్లాడుతున్నావా? అంటూ బండి సంజయ్‌పై మంత్రి పొన్నం ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంత్రో పొన్నం ప్రభాకర్ కామెంట్స్..

'నేను హిందువును.. మాంసం తినను.. రాముని జన్మభూమి ఎక్కడ అని నేను అనలేదు. అలా అంటే సజీవ దహనానికి నేను సిద్ధం. అమ్మ ప్రస్తావన తీసుకువచ్చింది ఎవరు? హుస్నాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద మా అమ్మ ఆత్మఘోషిస్తుందని అన్న వెదవ ఎవడు? మళ్లీ మా అమ్మ కాళ్ళు మొక్కుతా అంటున్నవా? బండి సంజయ్.. ఎప్పుడైనా కుటుంబ సభ్యుల గురించి మాట్లాడుకున్నామా? ఎన్నికల్లో ఓట్ల కోసం భార్య మంగళ సూత్రాలు అమ్ముకున్న నీవు ఇలా మాట్లాడుతావా? ఎంపీగా గెలిస్తే నన్ను రాజీనామా చేస్తావా అంటావా? సిగ్గు ఉందా నీకు? గంగుల కమలాకర్, నువ్వు కుమ్మక్కు అయ్యారు' అని తీవ్ర స్వరంతో, ఘాటైన వ్యాఖ్యలతో బండి సంజయ్‌పై నిప్పులు చెరిగారు మంత్రి పొన్నం ప్రభాకర్. శ్రీ రాముడు అంటే నాకు ఎంత గౌరవం.. ఆనాడు ఆయోధ్య రాముడిగా సీతమ్మ కోసం పడ్డ కష్టం.. తండ్రి మాటకు కట్టుబడి విలువిచ్చారు. రాముడి గురించి మాట్లాడే వీళ్లు.. నా తల్లి జన్మ గురించి మాట్లాడితే ఏం రాజకీయం.. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర, కేంద్ర నాయకత్వం ఆలోచించాలి.. వాళ్లని అడుగుతున్నా ఇటువంటి నాయకునికి డ్రామాలను సమర్థిస్తున్నారా..? బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడ్ని అడుగుతున్నా.. ఈ జిల్లాకి సంబంధించిన బీజేపీ నాయకులను అడుగుతున్నా.. ఈ నియోజకవర్గానికి సంబంధించి ఐదేళ్లలో మీరేం చేశారు.. నేను ఎంపీగా ఉన్నప్పుడు నేనేం చేశాను ప్రజలు గమనించాలి.. మీరు నియోజకవర్గాల్లో ఏం చేయలేదని ప్రజల్లో తిరుగుబాటు వస్తుందని ఓడిపోతాననే భయంతో ఇటువంటి ప్రస్తావన తీసుకొస్తున్నారు. ఈ మాట ఆనాడు కేసీఆర్ హిందూగాల్లు బొందుగాళ్లు అంటే రాజకీయంగా ఎన్నికల్లో ఏవిధంగా వాడుకున్నావొ.. తల్లి మాట నీ సమాధికి కారణం కాబోతుంది బండి సంజయ్.. జాగ్రత్త.. మేము హింసావాదులం కాదు.. శవం మీద పేలాలు ఏరుకునే రకం కాదు.. యాత్ర చేసుకో ఏమైనా చేసుకో.. మేము కాంగ్రెస్ పార్టీ వాళ్లం.. మేము యాత్రకి అడ్డుపడం" అని మంత్రి పొన్నం ప్రభాకార్ అన్నారు.


### 3,300 కేజీల
## డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న నేవీ

భారతీయ నౌకాదళం, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) మంగళవారం భారీ ఆపరేషన్ చేపట్టింది. సుమారు 3,300 కేజీల మాదకద్రవ్యాల్ని పట్టుకున్నారు. గుజరాత్‌లోని పోరుబందర్ తీరంలో ఆ డ్రగ్స్‌ను సీజ్ చేశారు. ఇటీవల కాలంలో ఇదే అతిపెద్ద డ్రగ్స్ పట్టివేత అని నేవీ వెల్లడించింది. సుమారు 3089 కేజీల ఛారస్, 158 కేజీల మెటాఫెటమైన్, 25 కేజీల మార్ఫైన్‌ను స్మగ్లింగ్ చేస్తున్న ఓ చిన్న షిప్‌ను నేవీ పట్టుకున్నది.ఆ షిప్‌లో ఉన్న అయిదుగురు పాకిస్థానీలను అదుపులోకి తీసుకున్నారు. పీ8ఐ ఎల్ఆర్ఎంఆర్ నిఘా ఎయిర్‌క్రాఫ్ట్ ద్వారా పోరుబందర్ తీరం వద్ద తిరుగుతున్న అనుమానిత షిప్‌ను గుర్తించారు. ఆ షిప్‌లో డ్రగ్ స్మగ్లింగ్ జరుగుతున్నట్లు నేవీ అధికారులు భావించారు. కొన్ని రోజుల క్రితం పుణెలో సుమారు 2500 కోట్లు ఖరీదు చేసే 1100 కేజీల మెఫెడ్రోన్ అనే డ్రగ్‌ను పట్టుకున్న విషయం తెలిసిందే.



### హిమాచల్ సీఎం
## సుఖ్వీందర్ సింగ్ రాజీనామా

హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను కాంగ్రెస్ హై కమాండ్‌కు పంపారు. ఎమ్మెల్యేల తిరుగుబాటు, అసమ్మతి నేపథ్యంలో సీఎంను మార్చే యోచనలో కాంగ్రెస్ అధిష్ఠానం ఉంది. ఇక, సాయంత్రం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమావేశమై కొత్త సీఎంను ఎన్నుకునే అవకాశం ఉంది. రాజ్యసభ ఎన్నికల్లో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీ అభ్యర్థికి క్రాస్ ఓటు వేయడం హిమాచల్ ప్రదేశ్ పాలిటిక్స్ ను షేక్ చేసింది. కాంగ్రెస్‌కు బిజెపి కంటే ఆరుగురు సభ్యుల బలం ఉన్నప్పటికీ అభ్యర్థిని గెలిపించుకోలేకపోయింది.. కాంగ్రెస్ పై ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తిరుగుబావుటా ఎగురవేసి బిజెపికి అభ్యర్థికి ఓటు వేశారు. దీంతో ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ తన పదవికి రాజీనామా చేశారు.



### 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు'
## ఓటీటీ డేట్ వచ్చేసింది

టాలీవుడ్ నటుడు, కలర్‌ఫొటో ఫేమ్ సుహాస్ హీరోగా నటించిన తాజా చిత్రం 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు'. దుశ్యంత్ కటికినేని ఈ చిత్రానికి దర్శకత్వం వహించగా. శివాని నగరం హీరోయిన్‌గా నటించింది. రూరల్ బ్యాక్ డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం ఫిబ్రవరి 02న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్ అందుకుంది. ఇప్పటివరకు ఈ చిత్రం రూ.15 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఇక బాక్సాఫీస్ వద్ద అలరించిన ఈ చిత్రం ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమయ్యింది.ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక ఆహాలో ఈ సినిమా మార్చి 01 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు చిత్రయూనిట్ వెల్లడించింది. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ ఎక్స్ వేదికగా ప్రకటించింది. ఇక ఈ సినిమాలో సుహాస్ హెయిర్ సెలూన్ నడిపిస్తూ.. మరోవైపు మ్యారేజి బ్యాండు టీంలో కలిసి పనిచేస్తూ.. శివానీతో లవ్‌లో పడే యువకుడిగా కనిపించాడు. ఈ మూవీలో పుష్ప ఫేం జగదీశ్ ప్రతాప్ బండారి, గోపరాజు రమణ కీలక పాత్రల్లో నటించారు. గీతా ఆర్ట్స్ 2, మహాయణ మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా తెరకెక్కించాయి.



సూర్య www.suryaa.com
EVENING EDITION 4PM



# హనుమకొండ జిల్లాలో ఉద్రిక్తత..

## బండి సంజయ్ కాన్వాయ్ పై కోడిగుడ్లతో దాడి

హనుమకొండ జిల్లాలో ఉద్రిక్తత నెలకొంది. బండి సంజయ్ ప్రజాహిత యాత్ర కాన్వాయ్ పై గుర్తు తెలియని దుండగులు కోడిగుడ్లతో దాడి చేశారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో ఘటన జరిగింది. పీవీ నరసింహారావు స్వగ్రామంలో పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి వెళ్తుండగా కాన్వాయ్ పై కోడిగుడ్లు పడటం స్థానికంగా ఉద్రిక్తతకు దారి తీసింది. పీవీ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల నుంచి ప్రధానిగా పనిచేసిన ఏకైక నాయకుడు పీవీ నర్సింహారావు అని బండి సంజయ్ అన్నారున. తెలంగాణ లీవిగా, పీవీ బహుభాషా కోవిదుడు, కవిగా, రచయితగా, జర్నలిస్టుగా పనిచేశారని తెలిపారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న దేశాన్ని గట్టెక్కించి దేశానికి ఎనలేని సేవలను చేశారని చెప్పారు. అలాంటి వ్యక్తికి భారత రత్న ప్రకటించిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనని అన్నారు. పీవీలాంటి గొప్ప వ్యక్తి చనిపోతే కనీసం ఢిల్లీలో అంత్యక్రియలు జరపకుండా పీవీ ఆత్మను, ఆయన కుటుంబ సభ్యులను అడుగడుగునా అవమానించింది కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు. పీవీని కాంగ్రెస్ పార్టీ ఎందుకు అవమానించిందో ఇప్పటికీ వివరణ ఇవ్వలేదన్నారు. పీవీకి భారతరత్న ప్రకటించినా కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోషం కూడా వ్యక్తం చేయని విమర్శించారు.



# భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు..

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ నష్టాలతో కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఎన్ఎస్ఈ నిఫ్టీ, సెన్సెక్స్ బుధవారం మిడ్ సెషన్ నాటికి సగం శాతం పైగా పడిపోయాయి. మధ్యాహ్నం 1.30 గంటలకు సెన్సెక్స్ 690 పాయింట్లు క్షీణించి 72,400 పరిధిలో ఉండగా.. నిఫ్టీ 204 పాయింట్లు 21,900 ఎగువన ఉంది. మరోవైపు బ్యాంక్ నిఫ్టీ, నిఫ్టీ మిడ్ క్యాపీ సూచీలు కూడా వరుసగా 478, 860 పాయింట్లు కోల్పోయాయి. ఈ నేపథ్యంలో అపోలో హాస్పిటల్, బజాజ్ ఆటో, పవర్ గ్రిడ్ కార్ప్, మారుతి సుజుకి, అదానీ ఎంటర్‌ప్రైస్ సంస్థల స్టాక్స్ టాప్ 5 నష్టాల్లో ఉండగా.. SBI లైఫ్ ఇన్సూరెన్స్, TCS, HUL, ఇన్ఫోసిస్, HDFC లైఫ్ వంటి కంపెనీల స్టాక్స్ టాప్ 5 లాభాల్లో ఉన్నాయి. ఈ క్రమంలోనే నేడు NSEలో 52 వారాల గరిష్ట స్థాయికి చేరుకున్న ప్రధాన స్టాక్‌లు ఉన్నాయి. వాటిలో పోద్దార్ పిగ్మెంట్స్ (11.78%), ధ్రువ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ (10%), జునిపర్ హోటల్స్ (10%), వీగార్డ్ ఇండస్ట్రీస్ (3.88%), Aster DM హెల్త్‌కేర్ (2.54%) కలవు. మరోవైపు అప్పుల ఊబిలో కూరుకుపోయిన టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా లిమిటెడ్ షేర్లు బుధవారం 10 శాతం పడిపోయాయి. కంపెనీ మంగళవారం తన ఫండ్ రైజింగ్ ప్లాన్‌ను ప్రకటించింది. అయితే ఇది పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను మార్చడంలో సహాయపడలేదు. బీఎస్ఈలో కంపెనీ షేర్లు 9.95 శాతం పడిపోయి రూ.14.29కి చేరాయి. ఇది దీని దిగువ సర్క్యూట్ కావడం విశేషం. వోడాఫోన్ ఐడియా లిమిటెడ్ ఈక్విటీ, ఈక్విటీ లింక్డ్ సాధనాల ద్వారా రూ. 20,000 కోట్లను సమీకరించడానికి బోర్డు ఆమోదం పొందింది. మరోవైపు ఆర్బీఐ ఆంక్షల నేపథ్యంలో పేటీఎం షేర్లు కూడా దిగువకు పయనిస్తున్నాయి.



# వైఎస్సార్ రైతు భరోసా నిధులు

# జమ చేసిన సీఎం జగన్

వరుసగా ఐదో ఏడాది.. వైఎస్సార్ రైతు భరోసా పెట్టుబడి సాయం సొమ్మును రైతుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారు. రబీ 2021-22, ఖరీఫ్-2022 సీజన్లకు గాను అర్హులైన రైతు కుటుంబాలకు సున్నా వడ్డీ రాయితీ సొమ్మును కూడా చెల్లించారు. ఈ రెండు పథకాలకు అర్హత పొందిన రైతు కుటుంబాల ఖాతాలకు సాయాన్ని సీఎం జగన్ తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి బటన్ నొక్కి జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. వరుసగా ఐదో ఏడాది రైతు భరోసా అందిస్తున్నాం. మొత్తం 53.58 లక్షల మంది రైతన్నల ఖాతాల్లో రూ.1,078.36 కోట్లు జమ. కౌలు రైతులు, అటవీ, దేవాదాయ భూముల సాగు రైతులకు సాయం. 57 నెల్లలో రైతు భరోసా కింద అందించిన మొత్తం రూ.34,288 కోట్లు. మేనిఫెస్టోలో చెప్పిన దానికన్నా ఒక్కో రైతన్నకు అదనంగా రూ.17,500 ఇస్తున్నాం.

**రైతు ప్రభుత్వం మనది..**

మన ప్రభుత్వం వేసిన ప్రతీ అడుగూ కూడా రైతులు, రైతు కూలీలు బాగుండాలని వేశాం. క్రమం తప్పకుండా వైయస్సార్ రైతు భరోసా కింద సహాయాన్ని అందించాం. పెట్టుబడి సహాయంగా, రైతన్నకు దన్నుగా ఇది అందించాం. రాష్ట్రంలో దాదాపు 50శాతం లోపు రైతులన్నకున్న భూమి అర హెక్టారు లోపలే. హెక్టారు లోపల ఉన్న రైతులు 70 శాతం ఉన్నారు. ఈ పెట్టుబడి సహాయం వారికి ఎంతో మేలు చేసింది. వంద శాతం రైతులకు 80శాతం ఖర్చు రైతు భరోసా కింద కవర్ అయ్యింది. పేద రైతుల పక్షపాత ప్రభుత్వం మనది, దీనికి నేను గర్వపడుతున్నాను. సున్నా వడ్డీ కింద కూడా రూ.215.98 కోట్లు విడుదల చేస్తున్నాం. రుణాలు తీసుకుని క్రమం తప్పకుండా కట్టే రైతులకు మేలు చేస్తున్నాం.ఇప్పటివరకూ 84.66 లక్షల మంది రైతన్నలకు ఇప్పటి వరకూ అందించిన వడ్డీ రాయితీ 2,050 కోట్లు. మొత్తంగా రైతు భరోసా, సున్నా వడ్డీ కింద రైతులకు ఇవాళ విడుదలచేస్తున్న మొత్తం రూ.1,294.38 కోట్లు అందించాం. ప్రతీ అడుగులోనూ రైతన్నలకు తోడుగా నిలుస్తున్నాం. ప్రతీ పథకం దాదాపుగా పేద రైతు కుటుంబానికి అందుబాటులో ఉంచడం జరిగింది. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన దానికంటే ఏడాదికి రూ.12500 బదులు వేయి పెంచి రూ.13500 ఇచ్చాం. 50వేల స్థానంలో ఐదేళ్లలో రూ.67,500 ఇచ్చాం. చెప్పినదానికంటే ఎక్కువగా ఇచ్చిన ప్రభుత్వం మనది. రైతు కష్టం తెలిసిన ప్రభుత్వంగా ఈ ఐదేళ్లలో ముందుకు సాగాము. ప్రతీ సందర్భంలోనూ వారికి తోడుగా నిలిచాం.

**రైతులకు నాణ్యమైన ఉచిత కరెంట్..**

19 లక్షల మంది రైతులకు 9 గంటలపాటు నాణ్యమైన కరెంటు ఇస్తున్నాం. ఉచిత విద్యుత్ కింద ప్రతి రైతుకు రూ.45వేల మేర మేలు జరుగుతుంది. ఏడాదికి దాదాపుగా రూ.9 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. రైతుల తరఫున ఉచిత పంటల బీమాకు ప్రీమియం కడుతున్న ఏకైక రాష్ట్రం మన రాష్ట్రం మనది. గతంలో ఎప్పుడూ కూడా రైతుల తరఫున ఎప్పుడూ బీమా ప్రీమియం చెల్లించలేదు. దేశంలో కూడా ఎక్కడా లేదు. రైతులకు ఎక్కడ కష్టం వచ్చినా ఏ సీజన్‌లో నష్టం జరిగితే అదే సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చాం. కేవలం ఈ ఐదేళ్లలో మాత్రమే ఇలా జరిగింది. ఇదొక విప్లవాత్మక మార్పు. నష్టం నుంచి రైతు తట్టుకుని నిలబడి తిరిగి పంటలు వేసుకునే పరిస్థితి రావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం విప్లవాత్మక చర్యగా దీన్ని అమలు చేసింది.

**ఆక్వా రైతులకు సాయం..**

గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాలను పెట్టాం. అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను రైతుకోసం పెట్టాం. రైతులకు ఇ-క్రాప్ చేస్తూ అన్నిరకాలుగా ఆదుకుంటున్నాం. విత్తనం నుంచి పంట అమ్మకం వరకూ కూడా రైతులను చేయిపట్టుకుని నడిపించాం. ఈ ఐదేళ్లకాలంలో మాత్రమే ఇలా జరిగింది. ఆక్వా రైతులకు రూ.1.5కే కరెంటు ఇస్తూ ఆదుకున్నాం. ఆక్వా జోన్లలో ఉన్న ఆక్వారైతులకు తోడుగా నిలిచాం. పాల సేకరణలో కూడా రైతులకు తోడుగా నిలిచాం. రూ.10-20ల వరకూ రైతులకు అధిక ధరలు వచ్చాయి. పాలసేకరణలో ఈ ఐదేళ్ల కాలంలోనే రైతులకు రేట్లు పెరిగాయి. సహకార రంగంలోనే దేశంలోనే అతిపెద్ద సంస్థ అయిన అమూల్‌ను తీసుకు వచ్చి ఈ రంగంలో పోటీని పెంచాం. తద్వారా రైతులకు మేలు జరిగింది.

**భూ సర్వే..**

100 సంవత్సరాల క్రితం భూ సర్వే జరిగింది. అప్పటినుంచి రికార్డులు అప్‌డేట్ కాకపోవడం, సబ్ డివిజన్లు జరక్కపోవడం జరిగింది. వివాదాలకు చెక్‌పడుతూ సమగ్ర సర్వే చేపట్టాం. రికార్డులను అప్‌డేట్ చేస్తూ రిజిస్ట్రేషన్ సేవలను గ్రామస్థాయిలో తీసుకు వచ్చాం. 34.77 లక్షల ఎకరాల మీద పూర్తి హక్కులను రైతులకు, పేదలకు కల్పించాం. గతానికి, ఈ ఐదేళ్ల కాలానికి తేడా గమనించాలని కోరుతున్నాను. 87,612 కోట్ల రూపాయలు రైతుల రుణాలు మాఫీచేస్తామని చంద్రబాబు చెప్పారు. బ్యాంకుల్లో బంగారం రావాలంటే బాబే ముఖ్యమంత్రి కావాలన్నారు. దీంతో రైతులు నమ్మి అధికారం ఇస్తే.. దారుణంగా మోసం చేశారు. బేషరుతుగా రుణాలు మాఫీచేస్తానని చెప్పి చివరకు రుణమాఫీ పత్రాలు ఇచ్చి మోసం చేశారు. చివరకు సున్నా వడ్డీ పథకాన్ని కూడా ఎగొట్టారు. చివరకు మన ప్రభుత్వమే చెల్లించింది. బాబు హయాంలో రైతన్నలు కట్టిన వడ్డీలు, చక్రవడ్డీలే ఏడాదికి దాదాపు రూ.5-6 వేల కోట్లు. అంత దారుణంగా చంద్రబాబు గతంలో మోసం చేశారు. మనం ఈ ఐదేళ్లలో వైయస్సార్ రైతు భరోసా కింద రూ.34వేల కోట్లు ఇచ్చాం. ధాన్యం కొనుగోలుకోసం రూ.65 కోట్లు ఖర్చు చేశాం. ఇదికాక రూ.1.2 లక్షల కోట్లు రైతన్నలకు వివిధ పథకాలు ద్వారా అందించాం అని అన్నారు.



## మార్చి 4న తెలంగాణకు రానున్న

# ప్రధాని మోడీ

తెలంగాణలో బీజేపీ అగ్రనేతలు వరుస ఎన్నికల పర్యటనలు సిద్ధమవుతున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి కనీసం పది ఎంపీ సీట్లు గెలవడమే లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ప్రచారాన్ని ప్రారంభించకముందే ముమ్మరంగా ప్రచారం చేపట్టాలని బీజేపీ భావిస్తోంది. ఆ మేరకు ఆ పోటీలకు అభ్యర్థుల ప్రకటనకు ముందే.. ఈ నెలాఖరులోగా అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించి ఎన్నికల ప్రచారం చేసేందుకు బీజేపీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ సహా అగ్రనేతలు రాష్ట్రంలో పర్యటించి సభలు నిర్వహించేందుకు సన్నద్ధం మవుతున్నట్లు తెలుస్తుంది. ఇక ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే ఆదిలాబాద్, సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన సభలను ప్రధాని మోడీ సందర్శించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. వచ్చే నెల 4న హైదరాబాద్ లో అమిత్ షా లోక్ సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని తెలుస్తోంది. ముందుగా రాష్ట్ర పర్యటన ఖరారైతే.. అదే రోజు అమిత్ షాకు బదులు మోడీ సభ నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ సమావేశానికి గచ్చిబౌలి, సరూర్‌నగర్ స్టేడియంలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

## ఆటో-బస్సు ఢీ.. నలుగురి మృతి

సూర్యాపేట జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. బుధవారం ఉదయం మోతె సమీపంలో ఆటో, బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళ్తే.. మునగాల మండలం రామసముద్రానికి చెందిన 15 మంది కూలీలు మోతె మండలం బురకచెర్ల గ్రామానికి మిరపకోత పనుల కోసం ఆటోలో వెళ్తున్నారు. ఈ క్రమంలో వారు సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారి అండర్ పాస్ వంతెన వద్దకు రాగానే వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరుపై వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులను సూర్యాపేట ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సౌభాగ్యమ్మ అనే మహిళ చనిపోయారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు మధిర డిపోకు చెందినదిగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నేడు విచారణకు హాజరు కాలేను: క్రిష్

రాడిసన్ హోటల్‌లో డ్రగ్స్ వ్యవహారంలో సినీ దర్శకుడు జాగర్లమూడి క్రిష్ బుధవారం విచారణకు హాజరుకాలేనని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రస్తుతం తాను ముంబైలో ఉన్నందున మరో రెండు రోజులు సమయం కావాలని కోరారు. శుక్రవారం వ్యక్తిగతంగా విచారణకు హాజరవుతానని తెలిపారు. కాగా ఇప్పటికే డ్రగ్స్ సప్లై చేసిన సయ్యద్ అబ్బాస్ అలీని పోలీసులు అరెస్టు చేశారు. సయ్యద్ అబ్బాస్ అలీ ఫోన్లో ప్రముఖుల చిట్టా ఉంది. ఈ డ్రగ్ కేసులో సయ్యద్‌తో పలువురు చాటింగ్ చేశారు. గతంలో సయ్యద్ రాడిసన్ హోటల్లో ఉద్యోగిగా పనిచేశారు. డ్రగ్ పార్టీలో పరారీలో ఉన్న ఇద్దరు యువతులు నటి లిషి, శ్వేత కోసం పోలీసులు గాలిస్తున్నారు. కాగా రాడిసన్ హోటల్‌లో డ్రగ్స్ వ్యవహారంలో ప్రధాన నిందితుడు వివేకానంద వాంగ్మూలం మేరకు.. పోలీసులు క్రిష్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు అధికారులు మంగళవారం క్రిష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. విచారణకు హాజరవ్వాలని, ఈ కేసు దర్యాప్తునకు సహకరించాలని కోరారు. అయితే.. తాను బయట ఉన్నానని, బుధవారం విచారణకు వస్తానని పోలీసులతో అన్నారు. అయితే ముంబైలో ఉన్న నేపథ్యంలో మరో రెండు రోజులు సమయం కావాలని క్రిష్ కోరారు. క్రిష్‌తోపాటు.. లిషి గణేశ్ పేర్లు వెలుగులోకి రావడంతో.. తాజా ఘటన మరోసారి టాలీవుడ్‌ను ఉలిక్కిపడేలా చేసింది.

**పరారీలో ప్రముఖులు**

ఈ కేసులో మొత్తం పది మంది ఉన్నట్లు ఎఫ్ఐఆర్ స్పష్టం చేస్తుండగా.. వివేకానంద, అతనికి డ్రగ్స్ సరఫరా చేసే అబ్బాస్, కేదార్, నిర్భయ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. కేదార్, నిర్భయ్‌లకు నార్కోటిక్స్ పరీక్షలు నిర్వహించగా.. పాజిటివ్ అని తేలినట్లు మాదాపూర్ డీసీపీ



వినీత్ తెలిపారు. మిగతా ఆరుగురు పరారీలో ఉన్నారు. వీరంతా నగరంలోనే ఉన్నారా? అనేదానిపై పోలీసులు దృష్టి సారించారు. వీరిలో.. క్రిష్‌తోపాటు.. సెలబ్రిటీలు శ్వేత, నీల్, సినీనటి లిషి, సందీప్, రఘుచరణ్ ఉన్నారు. వీరిని పట్టుకునేందుకు గచ్చిబౌలి, ఎస్‌వోటీ పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు డీసీపీ చెప్పారు. వారు డ్రగ్స్ తీసుకున్నారా? లేదా? అనేదాన్ని బట్టి కేసు దర్యాప్తులో పురోగతి ఉంటుందని వివరించారు. అబ్బాస్ అనే డ్రగ్ పెడ్లర్ గతంలో మంజీరా గ్రూప్‌లో పనిచేశాడని, అప్పటి నుంచే వివేకానందకు అతనితో పరిచయం అని పోలీసులు తెలిపారు. వివేకానందకు అతను 10 సార్లు డ్రగ్స్‌ను సరఫరా చేశాడని వెల్లడించారు. కాగా.. తనపేరు బయటకు రావడంపై క్రిష్ స్పందించారు. తాను ఆరోజు రాడిసన్ హోటల్‌కు వెళ్లింది నిజమేనని, ఓ అరగంట ఉండి.. సాయంత్రం 6.45కు బయటకు వచ్చానని వివరించారు. ఈ క్రమంలో వివేకానందతో కాసేపు మాట్లాడానన్నారు. పోలీసుల విచారణకు హాజరవుతానని చెప్పారు.

# అందుకే పెళ్లి ఎప్పటికీ చేసుకోను



ప్రస్తుతం ట్రెండ్ మారింది. ఒక వయసు వచ్చాక పెళ్లి కచ్చితంగా చేసుకోవాలనే మాటను పక్కన పెట్టేస్తున్నారు. సింగిల్ గా లైఫ్ ఎంజాయ్ చేయాలనుకుంటున్నారు. ఈ విషయంలో సెలబ్రెటీలు ముందుంటున్నారు. ముఖ్యంగా ఇండస్ట్రీలోని కొందరు హీరోయిన్స్ పెళ్లి అనే మాటకు దూరంగా ఉండడమే బెటర్ అంటున్నారు. ఓవైపు బాలీవుడ్ ఇండస్ట్రీలో పెళ్ళిళ్ల సీజన్ నడుస్తుంది. బాలీవుడ్ భామలు వైవాహిక బంధంలోకి అడుగుపెడుతుండగా..సౌత్ బ్యూటీస్ మాత్రం సింగిల్ లైఫ్ ఈజ్ బెస్ట్ అంటున్నారు. ఇప్పుడు నాలుగు పదుల వయసులో సెకండ్ ఇన్నింగ్స్ లో దూసుకుపోతుంది త్రిష. పొన్నియన్ సెల్వన్ సినిమాతో సాలిడ్ కంబ్యాక్ ఇచ్చిన ఈ బ్యూటీ బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు చేస్తూ పెళ్లి గురించి అసలు ఆలోచించడం లేదు. ఇక ఇప్పుడిప్పుడే మళ్లీ సినిమాలు చేస్తూ బిజీ అవుతుంది అనుష్క. ఇక పెళ్లి అసలే చేసుకోనంటుంది హీరోయిన్ ఆండ్రియా జెర్మియా. ఇంతకీ ఈ బ్యూటీ చెప్తున్న కారణమేంటో తెలుసా? ఆండ్రియా జెర్మియా తెలుగు, తమిళం, మలయాళంలో పలు చిత్రాల్లో నటించింది. అయితే ఈ బ్యూటీకి అనుకున్నంత స్థాయిలో గుర్తింపు మాత్రం రాలేదు. ఇటీవల వెంకటేశ్ నటించిన సైంధవ్ మూవీలో కీలకపాత్ర పోషించింది. తాజాగా ఈ బ్యూటీ తన పెళ్లి గురించి మాట్లాడింది. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తనకు ఎప్పటికీ పెళ్లి చేసుకోవాలని లేదని తెలిపింది. "20-25 ఏళ్ల వయసులో పెళ్లి చేసుకోవాలనుకున్నాను. కానీ ఆ సమయంలో కుదరలేదు. ఇక ఇప్పుడు పెళ్లి చేసుకుంటే సంతోషిస్తానని కాదు, పెళ్లి కాకపోయినా చాలా సంతోషంగా ఉంటాను.. " అని చెప్పుకొచ్చింది.